క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ అభియాన్



ఉండవెల్లి: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మండల సూపర్‌వైజర్ ఆస్మా ఆధ్వర్యంలో పోషణ అభియాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, అన్వేషణ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



ధరూరు: మండలంలోని జాంపల్లి, కొత్తపాలెం తండాల్లో విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఐకేపీ సెర్ప్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన యనిఫాంను ఐకేపీ సీసీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం రేవతి అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో కంటి పరీక్షలు



మానవపాడు: మండలంలోని వసతిగృహాల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డాక్టర్లు సవిత, రాఘవేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. 13మంది విద్యార్థులకు కంటి సమస్యలున్నాయన్నారు. వసతిగృహాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల నుంచి దరఖాస్తుల వెల్లువ



శాంతినగర్: రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కాని రైతులు వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల రైతు వేదికలో మంగళవారం వ్యవసాయశాఖ ఎంఏఓ రాధ ఆధ్వర్యంలో రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులో పేర్లులేని వారు, రేషన్‌కార్డు లేని వారు రుణమాఫీ అయ్యేలా చూడాలని పొలం పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్, కుటుంబసభ్యుల ఆధార్‌కార్డుల జిరాక్స్‌లతో పాటు దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరు మధ్యలో ప్రమాదకరంగా బావి



ధరూరు: దశాబ్దాల క్రితం తాగునీటి అవసరాల కోసం బావి ఏర్పాటు చేశారు. ఆ బావి చాలా కాలంగా ఉపయోగంలో లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. నివాస గృహాల మధ్య ఉన్న బావి వల్ల ఎలాంటి ప్రమాదం ఏర్పడకముందే పూడ్చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నెట్టెంపాడు ఎస్సీ కాలనీ సమీపంలో పురాతన బావి ఉంది. పిల్లలు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలకు బావి పూర్తిగా నిండింది. గతంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో పురాతన బావులు, ఇండ్లను పూడ్చాలని ప్రభుత్వం ఆదేశించినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. అధికారులు మేల్కొని బావిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



అలంపూర్‌లో మాట్లాడుతున్న సీఐ రవిబాబు, హాజరైన స్థానికులు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వర్‌రెడ్డి

గద్వాల క్రైం: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మండపాలు ఏర్పాటు చేసుకుంటున్న నిర్వాహకులు, ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని గద్వాల సీఐ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 7 నుంచి పట్టణంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జనం రోజు ఎలాంటి ఘర్షణలు, దాడులు, వ్యక్తిగత కక్షలకు తావివ్వకుండా నిర్వాహకులు సహకరించాలన్నారు. వినాయక చవితి సందర్భంగా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ ఉన్నారు.

అలంపూర్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. అలంపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవాలపై శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు చేసే ప్రదేశం వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. నిమజ్జనం చేసే తేదీని తప్పక అందులో సూచించాలన్నారు. నిమజ్జనం రాత్రి 9 గంటల లోపు పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. భద్రతకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఐ మహ్మద్ బాష, నాయకులు కేకే సత్యం, శ్రీనివాసులు, వేణుగోపాల్ శెట్టి, రజిని బాబు, రుక్మొద్దీన్, నర్సన్‌గౌడ్, సంజీవ నాయుడు, శ్రీనివాసులు, సురేష్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించండి

అయిజ: వినాయక చవితి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని శాంతినగర్ సీఐ టాటా బాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ విజయభాస్కర్‌తో కలిసి పట్టణ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్, పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వివిధ సంఘాల నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

ఎర్రవల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో గణపతి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. పోలీస్‌శాఖ విడుదల చేసిన లింక్ ద్వారా తమ కమిటీ వివరాలను ఆన్‌లైన్‌లో తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా పండుగను, చివరి రోజు నిమజ్జనం ర్యాలీలు నిర్వహించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

వ్యాపార దుకాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



దుకాణాలను తొలగిస్తున్న ప్రొక్లెన్

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్య ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దానికి సంబంధించి 'సాక్షి' దిన పత్రికలో గతనెల 29న 'ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించరా?' అనే కథనం ప్రచురణయింది. అందుకు స్పందించిన జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్మారెడ్డి మంగళవారం చర్యలు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాలను మున్సిపల్ సిబ్బందితో తొలగించే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ చిన దేవన్న దగ్గరుండి తోపుడు బండ్లు, గుడారాలను మున్సిపల్ సిబ్బందితో తొలించారు. స్థిరంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లను జేసీబీతో తొలగించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించకుంటే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

గణేష్ ఉత్సవ మండల కమిటీ ఎన్నిక



అలంపూర్‌లో గణేష్ ఉత్సవాల మండల కమిటీ సభ్యులు

అలంపూర్: గణేష్ ఉత్సవ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి సంజీవ నాయుడు తెలిపారు. అలంపూర్ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. గణేష్ మండప నిర్వాహక సభ్యులు అధ్యక్ష,, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సన్‌గౌడు, ప్రధాన కార్యదర్శిగా ఎంటీ సంజీవ నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలంపూర్ అధ్యక్షుడిగా బాలరాజు, ఇమాంపురం అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, కాశీపురం అధ్యక్షుడిగా పరశురాముడు, గొందిమల్ల అధ్యక్షుడిగా లక్ష్మణ్ నాయుడు, బుక్కాపురం అధ్యక్షుడిగా యుగంధర్ రెడ్డి, కోనేరు అధ్యక్షుడిగా రంజిత్ కుమార్, ర్యాలంపాడు అధ్యక్షుడిగా శ్రీనివాసులు, క్యాతూర్ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లెలపాడు అధ్యక్షుడిగా రామకృష్ణ బాబు, సుల్తానాపురం అధ్యక్షుడిగా శివశంకర్ గౌడ్, లింగనవాయి అధ్యక్షుడిగా సుధాకర్, ఉట్కూరు అధ్యక్షుడిగా నరేందర్, భీమవరం అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి, సింగవరం–1 అధ్యక్షుడిగా మద్దిలేటి, సింగవరం–2 అధ్యక్షుడిగా రవికిషోర్, భైరన్‌పల్లి అధ్యక్షుడిగా నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో గణేష్ మండప నిర్వాహకులు కార్యవర్గ కమిటీలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



కాలిపోయిన కిరాణదుకాణం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: మండలంలోని మార్లబీడుకు చెందిన నర్సింహులు కిరాణ, జనరల్ స్టోర్ డబ్బాకు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని బాధితుడి పరామర్శించారు. దాదాపు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ విజయ్ కుమార్, శ్రీరాములు, ఆనంద్‌రెడ్డి ఉన్నారు.

చిన్నోనిపల్లె సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం దగ్గర వినతిపత్రంతో చిన్నోనిపల్లె గ్రామస్తులు

గట్టు: చిన్నోనిపల్లె ముంపు సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా చిన్నోనిపల్లె దగ్గర నిర్మించిన రిజర్వాయర్‌లో గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించినట్లు తెలిపారు. 2005లో ప్రారంభమైన ప్రాజెక్టు 2024 వరకు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. అప్పటి రేట్లకు ఇప్పటి రేట్లకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. పునరావాస కేంద్రంలో అప్పట్లోనే డబ్బులు చెల్లించి ఉంటే అప్పుడే ఇళ్లు నిర్మించుకునే వాళ్లమని, ఇప్పుడు కట్టుకోవాలంటే డబ్బులు సరిపోవడం లేదన్నారు. వట్టెం ప్రాజెక్టులో ముంపు నిర్వాసితులకు అందజేసిన మాదిరిగా చిన్నోనిపల్లె నిర్వాసితులకు అందజేయాలని, పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. షిఫ్టింగ్ చార్జీలు కొందరికి చెల్లించలేదని, వారికి కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ప్లాట్లను కేటాయించాలని వినతి పత్రంలో గ్రామస్తులు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ధరనీశా మంగళవారం తెలిపారు. కృష్ణానదితో పాటు ఆయా గ్రామాల సమీపంలోని పలు వాగులు పొంగి పొర్లుతున్నందున ప్రజలు అత్యవసరం ఐతే తప్పా బయటకు రాకూడదన్నారు. వాహనదారులు, ప్రయాణికులు వాగులను, రోడ్లపై ఉన్న నీటి గుంతలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పాడుబడ్డ ఇండ్లలో ఉన్న వారు వెంటనే ఖాళీ చేయాలన్నారు. ప్రజలకు సమస్యలు ఉంటే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

వర్షానికి కూలిన గుడిసె



గువ్వలదిన్నెలో పడిపోయిన గుడిసె

కేటీదొడ్డి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఉన్న గుడిసె కూలిపోవడంతో ఓ కుటుంబం రోడ్డున పడిన సంఘటన మండలంలోని గువ్వలదిన్నెలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దుబ్బన్న దంపతులు జీవనం సాగిస్తున్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి చుట్టు ఉన్న గోడలు పూర్తిగా పడిపోయాయి. గంగన్‌పల్లి గ్రామానికి చెందిన జంగిలప్ప వాట్లు పడిపోయాయి. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయం అందించాలని తహసీల్దార్‌ను కోరారు.

అప్పు డబ్బుల కోసం గొడవ : కేసు నమోదు

గట్టు: అప్పుగా ఇచ్చిన డబ్బులను వడ్డీతో కలిపి చెల్లించాలంటూ ఇంటికి వెళ్లి గొడవ చేసి, చెంపపై కొట్టిన సంఘటనలో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కేటీ మల్లేష్ వివరాల ప్రకారం.. గొర్లఖాన్‌దొడ్డికి చెందిన ధర్మారెడ్డి అదే గ్రామానికి చెందిన మార్క్‌కు 7 ఏళ్ల క్రితం రూ.20 వేలు అప్పు ఇచ్చాడు. అసలు వడ్డీ కలిపి ఇవ్వాలంటూ ఆదివారం ధర్మారెడ్డి మార్క్ ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. ఏడేళ్లుగా వడ్డీని కడుతున్నానని, ఈ ఏడాది ఇబ్బంది కారణంగా కట్టలేదని, 15 రోజుల సమయం ఇస్తే చెల్లిస్తానని మార్క్ చెప్పాడు. ఈ క్రమంలో వివాదం చెలరేగి మార్క్ చెంపపై ధర్మారెడ్డి కొట్టడంతో పాటుగా బెదిరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ సంఘటనపై మార్క్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాగు దాటేదెలా..?



వాగు పారుతుండడంతో ఎడ్లబండిపై వెళ్తున్న కూలీలు, రైతులు

శాంతినగర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు సమీపంలోని పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈదారి గుండా రైతులు, కూలీలు పొలాలకు వెళ్లాల్సి ఉంటుంది. నక్షరోడ్డు కావడంతో రాజోళి నుంచి పైపాడు మీదుగా ఆముదాలపాడు, నారాయణపురం గ్రామాలకు వెళ్తుంటారు. పూర్వం నుంచి ఏర్పాటు చేసిన రహదారి మూడు మండలాల ప్రజలకు ఉపయోగపడేది. పైపాడు సమీపంలో ఉన్న పెద్దవాగు ప్రయాణానికి ఆటంకంగా మారడంతో ప్రజలు వెళ్లడానికి వీలులేక పది కిలోమీటర్లు అదనంగా ప్రయాణిస్తున్నారు. ఈవిషయమై గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

నేడు శాంతినగర్ బంద్

శాంతినగర్: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం శాంతినగర్‌లో స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చారు. వ్యాపార సంస్థల యజమానులు బంద్‌కు సహకరించాలని పట్టణ వాసులు కోరారు.

వాహనాల తనిఖీ



మానవపాడు: రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు స్టేజీలలో వాహనాల తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో పోలీసులు, వాహనదారులు ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా, పుల్లూరు టోల్‌ప్లాజా రహదారి మార్గంలో ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. 8 డ్రంకెన్ డ్రైవ్, 14 బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేశారు. 20 మందిపై రూ.3925 చలాన్లు వేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో బ్లూ కోర్టు పోలీసులు పాల్గొన్నారు.

మల్దకల్ ఎస్‌ఐగా నందీకర్

మల్దకల్: మల్దకల్ ఎస్‌ఐగా నందీకర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ సురేష్‌గౌడు వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురానికి బదిలీ అయ్యారు. వీపనగండ్ల ఎస్‌ఐగా పని చేస్తున్న నందీకర్ మల్దకల్‌కు బదిలీపై వచ్చారు.

ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఎండీ బాష



సీఐతో ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఎండీ బాష

అలంపూర్: అలంపూర్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఎండీ బాష మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న నాగరాజుపై ఇటీవల మహిళతో లైంగిక వేధింపులు ఆరోపణలు వెల్లువెత్తాయి. సదరు మహిళా సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని ఖండించింది. సీఐ రవిబాబు సైతం మహిళపై వేధింపులను ఖండించారు. ఉన్నత అధికారులు ఎస్‌ఐపై విచారణ నిమిత్తం వీఆర్‌కు అటాచ్ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఎండీ బాష బాధ్యతలు స్వీకరించారు.

బ్యాంకుల్లో రైతుల బారులు



ఎస్‌బీఐలో బారులు తీరిన రైతులు

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల రుణమాఫీ మూడు విడతలు కావడంతో తమపేరున పంట రుణం మాఫీ అయ్యిందా.. లేదా అని తెలుసుకునేందుకు మంగళవారం పట్టణంలోని బ్యాంకుల్లో రైతులు బారులు తీరారు. వివరాలు తెలుసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. బ్యాంక్‌లవద్ద రుణమాఫీ జాబితా గోడలకు అతికించకపోవడంతో రైతులు బ్యాంకులో నేరుగా వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు చాలామంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. టెక్నికల్ లోపాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు అధికారులను నిలదీస్తున్నారు.

రైతులు అధికారుల సలహాలు పాటించాలి



మల్దకల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

మల్దకల్: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని ఏఓ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మల్దకల్ రైతు వేదికలో వ్యవసాయశాఖ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు నేరుగా రైతులు అధికారులతో మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూమి సారవంతంగా ఉంటుందన్నారు. పంటల సాగు విధానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు పంటలకు ఆశించే చిడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పెంచికలపాడులో వైద్య శిబిరం



పెంచికలపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గట్టు: మండలంలోని పెంచికలపాడు, తుమ్మలచెరువు గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. భవిష్య భారత్ ఎల్‌టీఐ మైండ్ ట్రీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మురళీధర్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి, మందులు అందజేశారు. ఫార్మాసిస్టు జిలాని, స్టాఫ్ నర్సు రాగిణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, ఆశా వర్కర్లు పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో నీళ్ల తొలగింపు



నారాయణపురంలో రైల్వే అండర్ బ్రిడ్జిలో నీటిని తొలగించిన అధికారులు

మానవపాడు: మండలంలోని నారాయణపురంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలో నీటిని మంగళవారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు చేరి గ్రామస్తుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కలెక్టర్ బీఎం సంతోష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వాటర్‌ను త్వరగా తొలగించాలని ఎంపీఓ భాస్కర్‌ను ఆదేశించారు. అధికారులు రెండు రోజుల్లో నీటిని తొలగించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నాగరాణి



బల్గెరలో పోషకాహారంపై వివరిస్తున్న సూపర్ వైజర్ వాసంతి

● సీడీపీఓ నాగరాణి

మల్దకల్: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నాగరాణి, డాక్టర్ స్వరూపరాణిలు సూచించారు. మంగళవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పోషణ మాసం నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బడిబయట ఉన్న చిన్నారులను గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారంను గర్భిణులు, బాలింతలు సక్రమంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

గట్టు: కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వాసంతి తెలిపారు. మంగళవారం మాచర్ల క్లస్టర్ పరిధిలోని బల్గెరలో 1,2,3,4 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. నేటి కిషోర బాలికలే రేపటి మహిళలు అని, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, శోభ, అలివేలమ్మ, కవిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.